క్లుప్తంగా

ఊరేగిన భీముని బండి కుంభం



యాదమరి: మండలంలోని పలు గ్రామాలలో భీముని బండి కుంభం ఊరేగింది. చెన్నారెడ్డి పల్లెలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం మధ్యాహ్నం ఈ కార్యక్రమం నిర్వహించారు. భీముని పాత్రధారి యాదమరి, పెరుమాళ్లపల్లె, వరదరాజులపల్లె, కట్టకిందవూరు, చెన్నారెడ్డి పల్లె గ్రామాలలో ఊరేగారు. భక్తులు బండి కుంభానికి పిండివంటలు సమర్పించి పూజలు చేశారు.

ఐఆర్‌డీఏ మీటర్లు ఏర్పాటు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో 170 సీటీ మీటర్ల స్థానంలో ఐఆర్‌డీఏ (స్కానింగ్)మీటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు నగర ట్రాన్స్‌కో డీఈ శేషాద్రి తెలిపారు. 20 కిలోవాట్ల లోడ్ కంటే అధికంగా ఉన్న ప్రభుత్వ, వాణిజ్య, పరిశ్రమలకు సీటీ మీటర్లు ఏర్పాటు చేశారన్నారు. వాటిని సంబంధిత ఏఈలు మాన్యువల్‌గా రీడింగ్ తీసి బిల్లులు ఇచ్చేవారని, వాటి స్థానంలో స్కానింగ్ మీటర్లు పెట్టాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పారు.

గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళం



విరాళం ఇస్తున్న గోపి కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్ట్‌కు గురువారం పూతలపట్టు మండలం లక్ష్మయ్య ఊరుకు చెందిన గంగారపు గోపి రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు ఇచ్చారు. స్వామివారి దర్శనానంతరం దాత కుటుంబ సభ్యులకు ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు, ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించండి

బంగారుపాళెం: మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డిని ప్రజా ప్రతినిధులు కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓను గురువారం జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, కరుణాకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువతో సన్మానించారు.

'ఫ్యామిలీ డాక్టర్' తనిఖీ



సేవలను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

యాదమరి: గ్రామీణ ప్రాంతాలలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి కోరారు. గురువారం ఆయన మండలంలోని వరదరాజులపల్లెలో యాదమరి ప్రభుత్వాసుపత్రి వైద్యులు నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యులతో మాట్లాడారు. ప్రతి రోగి సమస్యనూ సావధానంగా తెలుసుకుని చికిత్స చేయాలన్నారు. అలాగే దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడుతున్న రోగుల ఇళ్లకు వెళ్లినప్పుడు వారి ఆరోగ్యం మెరుగు పడే దిశగా వైద్యసేవలు అందివ్వాలని సూచించారు. అవసరమైన వారికి ల్యాబ్ టెస్టులు చేసి మందులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యాదమరి వైద్యాధికారి సురేఖ, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈరోజు

రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవం

ఐరాల: మండలంలోని వేదగిరివారిపల్లెలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ప్రారంభించనున్నట్లు గురువారం పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి తెలిపారు. పార్టీ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

మండల సర్వసభ్య సమావేశం

ఐరాల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచులు, కో–ఆప్షన్ మెంబర్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని తెలిపారు. అలాగే అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరి తెలిపారు. ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

నాడు: బర్త్ సర్టిఫికెట్ నుంచి డెత్ సర్టిఫికెట్ వరకూ ఏ ధ్రువపత్రం కావాలన్నా మండల కార్యాలయానికి పరుగులు తీసేవారు. అక్కడ అధికారుల చుట్టూ 10 నుంచి 15 రోజులపాటు ప్రదక్షిణలు చేస్తే కానీ ఒక సర్టిఫికెట్ మంజూరయ్యేది కాదు. త్వరగా సర్టిఫికెట్ మంజూరు కావాలంటే లంచం ఇచ్చుకోక తప్పదు. రేషన్ కార్డులు ఎప్పుడు వస్తాయో, ఉన్న కార్డులు ఎప్పుడు పోతాయో కూడా తెలియని పరిస్థితి. లబ్ధిదారులకు ప్రభుత్వ పథకం వర్తిస్తుందో, ఆ జాబితాలో పేరుందో.. లేదో కూడా లబ్ధి పొందే వరకు తెలియదు. పింఛన్ పొందాలంటే మండల లేక పంచాయతీ కార్యాలయం వద్దకు ఉదయమే వెళ్లి గంటలు కాదు, రోజుల తరబడి నిరీక్షించాలి. అలా నిరీక్షించిన వృద్ధులు స్పృహ కోల్పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆ గ్రామంలో ఒకవేళ పింఛనుదారుడెవరైనా మరణిస్తేగానీ కొత్త పింఛను ఇచ్చేవారు కాదు.

నేడు: విద్యార్థుల నుంచి రైతుల వరకు, పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు ఎలాంటి సర్టిఫికెట్ కావాలన్నా గ్రామ సచివాలయానికి వెళితే 15 నిమిషాల్లోనే మంజూరు చేస్తున్నారు. ఇక రేషన్ కార్డులైతే వలంటీర్లు ఇంటింటికీ తిరిగి మంజూరు చేశారు. కొత్త దంపతులు, వలస వచ్చిన వారి సౌకర్యార్థం ఆరు నెలలకోసారి కొత్త కార్డులు మంజూరు చేసే సదుపాయం ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వ ఉద్యోగులకు జీతమైనా ఆలస్యమవుతుందేమో కానీ, పింఛన్ అయితే ఒకటో తేదీ ఉదయమే వలంటీర్లు తలుపుతట్టి మరీ అందజేస్తున్నారు. ప్రతి ఆరు నెలలకోసారి కొత్త పింఛన్లు మంజూరు చేస్తోంది. ఏడాదికోసారి పింఛను మొత్తాన్ని పెంచుతూ పోతోంది. ఇలా సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను పల్లె ముంగిటకు తీసుకొచ్చిన ప్రభుత్వం గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు బాటలు వేస్తోంది.

సచివాలయం.. గ్రామ స్వరాజ్యం

- ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు
- సేవలందించడంలో వలంటీర్లే కీలకం
- సచివాలయ వ్యవస్థతో విప్లవాత్మక మార్పులు



టి.పుత్తూరు సచివాలయంలో విధుల్లో ఉన్న సచివాలయ సిబ్బంది



పల్లెచెరువు సచివాలయ భవనం

తవణంపల్లె: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్య స్థాపనకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. తద్వారా ప్రజల ముంగిటకే పాలన చేరింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హుల ముంగిటకు చేరవేయడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. లబ్ధిదారులు గడప దాటకుండానే ప్రభుత్వ సేవలు పొందుతున్నారంటే దానికి ప్రధాన కారణం సచివాలయ వ్యవస్థే. కొన్ని సందర్భాల్లో వలంటీర్లు అందుబాటులో లేకున్నా గ్రామ సచివాలయానికి వెళితే అవసరమైన సేవలు పొందుతున్నారు. సచివాలయ సిబ్బంది బాధ్యతతో వ్యవహరిస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. మండల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ సేవల్లో జాప్యం లేకుండా చర్యలు చేపడుతున్నారు. కలెక్టర్ నెలలో ఒక రోజు సచివాలయాలు తనిఖీ చేస్తూ సిబ్బందికి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్య సాధనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు.

మండల సచివాలయ వ్యవస్థ వివరాలు

సచివాలయాలు	- 17
గ్రామ పంచాయతీలు	- 32
గ్రామాలు	- 194
వలంటీర్ల సంఖ్య	- 259
సచివాలయ సిబ్బంది	- 138 మంది
వివిధ శాఖల్లోని ఉద్యోగుల సంఖ్య	- 195 మంది
సచివాలయాల్లో అందిస్తున్న సేవల సంఖ్య	- 545

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య
అమ్మఒడి	- 1976
వైఎస్సార్ చేయూత	- 1429
వైఎస్సార్ ఆసరా	- 3378
వైఎస్సార్ '0' వడ్డీ	- 2736
జగనన్న వసతి దీవెన	- 424
జగనన్న విద్యాదీవెన	- 595
వైఎస్సార్ రైతు భరోసా	- 2224
వైఎస్సార్ పెన్షన్ కానుక	- 9389
వైఎస్సార్ వాహన మిత్ర	- 61
జగనన్న చేదోడు	- 76
జగనన్న తోడు	- 239
వైఎస్సార్ నేస్తం	- 82
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	- 454

రైతుకు భరోసా



గత ప్రభుత్వంలో నష్టపోయిన రైతుకు పరిహారం అందడం లేదు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పిన మాట ప్రకారం ఏటా రైతు భరోసా అందించి మా ఖాతాలకు జమ చేసి భరోసా కల్పించడం సంతోషంగా ఉంది. ఇన్ని పథకాలు ఇంటి వద్దకే అందజేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుంది.

- కె.మునస్వామి శెట్టి, రైతు, ముట్టుకూరు

మహిళా పక్షపాతి



వైఎస్సార్ చేయూత పథకం ఏటా రూ.18,750 తీసుకుంటున్నా. దీంతో పొట్టేలు, మేకలు పోషించి విక్రయించడంతో మంచి లాభాలు వచ్చాయి. ప్రతి పథకంలో జగనన్న మహిళలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అన్ని విధాలుగా మహిళలకు అండగా నిలబడుతున్న జగనన్నకు ధన్యవాదాలు చెబుతున్నా.

- కాంతమ్మ, లబ్ధిదారు, దిగువ మోదలపల్లె

సేవలకు గుర్తింపు



సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో పాటు సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయడంలో కీలక పాత్ర పోషించినందుకు మమ్మల్ని గుర్తించిన ప్రభుత్వం సేవా వజ్ర అవార్డు ఇచ్చింది. ఈ అవార్డు నా బాధ్యతను పెంచింది. సచివాలయ వ్యవస్థ ద్వారా విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది.

-హసీఫా, వలంటీర్, పైమాఘం

పథకాలు అమలుకు కృషి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నా. ప్రతి నెల ఒకటో తేదీనే ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. సచివాలయం పరిధిలో గుర్తించిన ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నాం.

-ధనంజయ, వెల్ఫేర్ అసిస్టెంట్, టి.పుత్తూరు

విద్యకు అధిక ప్రాధాన్యం



విద్యార్థినితోపాటు తల్లిదండ్రులను సన్మానిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

- చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- సంతపేట మున్సిపల్ హైస్కూల్ లో ఘనంగా 'జగనన్న ఆణిముత్యాలు'
- టెన్త్, ఇంటర్ ప్రతిభావంతులకు సన్మానం
- నగదు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు ప్రదానం

చిత్తూరు కలెక్టరేట్: విద్యాభివృద్ధికి వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గురువారం చిత్తూరు నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నగరంలోని సంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో అట్టహాసంగా నిర్వహించారు. చిత్తూరు నియోజకవర్గ స్థాయిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులను, ఇంటర్మీడియెట్‌లో గ్రూపుల వారీగా ఉత్తమ ఫలితాలు సాధించిన నలుగురు విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' నగదు బహుమతితో పాటు, మెరిట్ సర్టిఫికెట్లు పతకాలు అందజేసి ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు పెడుతోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సర్కారు బడులను నాడు–నేడు పథకంతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిందన్నారు. విద్యార్థులకు చదువు భారం కాకుడదని సీఎం సరికొత్తగా ఆణిముత్యాలు పేరిట నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, నగర మేయర్ అముద మాట్లాడారు. ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ పురస్కారాలతో మరింతగా రాణించాలని, అలాగే తక్కిన విద్యార్థులు స్ఫూర్తి పొంది చదువుల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. అలాగే ప్రతిభావంతులైన విద్యార్థుల తల్లిదండ్రులు, సంబంధిత హెడ్‌మాస్టర్లు, కళాశాల ప్రిన్సిపాళ్లను కూడా శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో డీఈఓ విజయేంద్రరావు, చిత్తూరు ఎంఈఓ సెల్వరాజ్, కార్పొరేటర్ జ్ఞానజగదీశ్, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు భూపేశ్, నారాయణ, విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు.

సిద్ధంపల్లెలో..

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం సిద్ధంపల్లె ఉన్నత పాఠశాలలో గురువారం జగనన్న ఆణిముత్యం కార్యక్రమం నిర్వహించారు. పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన దేవిప్రియకు బంగారుపతకం, నిషితకు రజత పతకం, ముఖేష్‌కు కాంస్యపతకం, ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. ఉపాధ్యాయులు రవీంద్రరెడ్డి, నాయకులు సాము, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

గుడిపాల: మండలంలోని పానాటూరు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మనాభపిళ్లై తెలిపారు. అలాగే 24 గంటల విద్యుత్‌కు సంబంధించి గుడిపాల మండల కేంద్రం, నరహరిపేటలో కూడా సరఫరాను నిలిపివేస్తామన్నారు. కొత్తగా లైన్లు వేయడం వలన పాతలైన్ల మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

'స్మార్ట్ టికెట్' విధానంలో నిర్లక్ష్యమేల?

చిత్తూరు రూరల్: స్మార్ట్ టికెట్ విధానంలో నిర్లక్ష్యం ఎందుకని డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని ఓ ప్రయాణికుడు గురువారం యూటీఎస్ (యూనిఫైడ్ టికెట్ సొల్యూషన్) విధానం అమలు చేయడం లేదని బస్టాండులోని డీపీటీఓను ఆయన కార్యాలయంలో కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీనిపై ఆయన స్పందించి అధికారులతో మాట్లాడారు. విధిగా నిర్ణీత బస్సుల్లో యూటీఎస్ విధానం అమలు చేయాలన్నారు. ఆ విధానంలో టికెట్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, జీ పే, ఫోన్ పే ద్వారా నగదు చెల్లిస్తే టికెట్లు ఇవ్వాలన్నారు. మళ్లీ ఇలాంటి ఫిర్యాదులు రాకూడదని ఆయన హెచ్చరించారు.

17న జాబ్‌మేళా

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో ఈ నెల 17న ఉదయం 9.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల వైస్ చైర్మన్ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో పలు కంపెనీలు పాల్గొంటాయన్నారు. డిగ్రీ, బీసీఏ, బీబీఏ, బీఎస్సీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు, ఆయా కోర్సుల్లో చివరి సంవత్సరం చదువుతున్న వారు జాబ్‌మేళాకు హాజరుకావచ్చని తెలిపారు.

చట్టాలపై రైతులకు అవగాహన ముఖ్యం

- జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కరుణ కుమార్

చిత్తూరు అర్బన్: న్యాయపరమైన చట్టాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణకుమార్ అన్నారు. చిత్తూరులోని జిల్లా ఉద్యానశాఖ కార్యాలయంలో గురువారం రైతులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ, రాజ్యాంగంలో రైతులకు పొందుపరచిన హక్కులు, చట్టాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి అమలు చేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖ అధికారుల సూచనలు–సలహాలు పాటించి పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఎరువులు, విత్తనాలు వ్యవసాయ యంత్ర పరికరాలు కొనుగోలు చేసేటప్పుడు గ్యారెంటీ–వారంటీకి సంబంధించి రైతులు పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయానికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా రైతులు ఉచితంగా న్యాయం పొందవచ్చన్నారు. తొలుత ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ, పట్టు పరిశ్రమ, పశు సంవర్ధక, ఉద్యాన, ఏపీఎంఐ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను జిల్లా జడ్జి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, పశు సంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్, పట్టు పరిశ్రమ శాఖ జేడీ భరణి, ఏపీఎంఐ పీడీ రమణారెడ్డి, ఉద్యాన శాఖ ఏడీ కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇళ్ల ముంగిటకే వైద్యం

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇంటింటికీ వైద్య సేవలందిస్తున్నామని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు అన్నారు. మండలంలోని వెంగంపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 67 మంది రోగులకు, గర్భవతులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు అందజేశారు. గర్భవతులు సురక్షిత ప్రసవం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం గురించి తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భవతులు సద్వినియోగం చేసుకుని రక్తహీనత సమస్య బారిన పడకుండా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, డీఈఓ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు విజయ, రాజేశ్వరి, సుజాత పాల్గొన్నారు.

రామభద్రాపురంలో..

గుడిపాల: మండలంలోని రామభద్రాపురంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సుకన్య 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులను పరీక్షించారు. గర్భవతులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అనురాధ, ఎంఎల్‌హెచ్‌పి అనిత, సిబ్బంది చంద్ర, ప్రవీణ్, శివగామి పాల్గొన్నారు.

పేరయ్యగారిపల్లెలో..

ఐరాల: మండలంలోని పేరయ్యగారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 104 వైద్య శిబిరంలో రోగులు, గర్భిణులు, బాలింతలు, మధుమేహం వ్యాధి గ్రస్తులకు వైద్యపరీక్షలు చేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ఆపరేషన్ చేయించుకున్నవారి ఇళ్ల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు–సూచనలు ఇచ్చారు. క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవితే లక్ష్యం

- 'జగనన్న ఆణిముత్యాల' పురస్కారాల ప్రదానంలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



నియోజకవర్గ స్థాయిలో పదవ తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినికి నగదు బహుమతి ఇస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: మానవ వనరుల అభివృద్ధి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ స్థాయిలో టెన్త్, ఇంటర్ ప్రతిభావంతులకు 'జగనన్న ఆణిముత్యాల' నగదు పురస్కారాలను ఎమ్మెల్యే ప్రదానం చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యార్థులు ఫలితాలు సాధిస్తున్నారన్నారు. జగనన్న ఆణిముత్యాల పేరిట ఇస్తున్న పురస్కారాలు విద్యార్థుల్లో స్ఫూర్తిని, ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తాయన్నారు. డీవైఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ, విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని భావించిన సీఎం విద్యావ్యవస్థలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఇంటర్ 'ఆణిముత్యాలు' వీరే!

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన హిమచరణ్ (ఎంపీసీ) 929, డి.సౌమ్యప్రియ(బైపీసీ) 892, ఎస్.భానుతేజ(హెచ్‌ఈసీ) 848, బంగారుపాళ్యం మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కె.మహాగణపతి(సీఈసీ)(909 మార్కులు).. ఒక్కొకరికి రూ.15 వేల చొప్పున నగదు పురస్కారం, మెడల్, సర్టిఫికెట్ ప్రదానం చేయడంతోపాటు ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లు, విద్యార్థుల తల్లిదండ్రులను కూడా శాలువాలతో ఎమ్మెల్యే సత్కరించారు.

టెన్త్‌లో..

ఐరాల మండలం ఎం.పైపల్లెకు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు ఎస్.అస్మ (572), ఎస్.గీతిక (567), స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన కె.హారిక(566)కు వరసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతితోపాటు మెడల్, సర్టిఫికెట్, జ్ఞాపికలతో సత్కరించారు. ఆ స్కూళ్ల హెచ్‌ఎంలను, విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ఘనంగా సత్కరించారు. అలాగే, టెన్త్ పరీక్షల్లో స్థానిక పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన హారికకు రూ.3 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన గీతాంజలి రూ.2 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన నవ్యకు రూ.1000 చొప్పున అందజేశారు. కార్యక్రమంలోఎంపీపీ మోహన్, పూతలపట్టు జెడ్పీటీసీ దేవిక, కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ హారూన్, పార్టీ నేతలు సురేష్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, ధనచంద్రారెడ్డి, మురళి, పరమేశ్వర్‌రెడ్డి, మధుకుమార్, లోకనాథ్‌రెడ్డి, శేషాద్రి, సురేంద్రరెడ్డి, ఓబుల్‌రెడ్డి, రత్నం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రవీంద్రరెడ్డి, పీఎంసీ సభ్యులు నంద కుమార్, ఎంపీడీఓ నాగరాజు పాల్గొన్నారు.

తొడతర, అరగొండలో..



తవణంపల్లె : అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలో..



తవణంపల్లె : తొడతర హైస్కూలులో..

తవణంపల్లె: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఉదగాలని అరగొండ సర్పంచ్ మల్లుదొరై ఆకాంక్షించారు. మండలంలోని అరగొండ బాలికల హైస్కూల్, తొడతర హైస్కూల్లో పదవ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు గురువారం 'జగనన్న ఆణిముత్యాలు' పురస్కారాలను అందజేశారు. అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మోహన్ రెడ్డి, సర్పంచ్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ హరిబాబు, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్ ప్రశాంతకుమార్ చేతుల మీదుగా, అలాగే తొడతర హైస్కూల్లో హెచ్‌ఎం ప్రకాష్‌బాబు, తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ హేమలత, సర్పంచ్ రాధిక, పార్టీ నాయకులు మధుసూదన్ రెడ్డి, టీచర్లు నగదు, మెడల్, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు



మాట్లాడుతున్న మలేరియా అధికారి శ్రీనివాసులు

బంగారుపాళెం/పూతలపట్టు: సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు అన్నారు. గురువారం బంగారుపాళెం, పూతలపట్టు మండల పరిషత్ కార్యాలయాల సమావేశ మందిరంలో గ్రామ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా, డెంగీ, విషజ్వరాలు ఎలా వ్యాపిస్తాయి? నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలు, దోమల లార్వాలను గుర్తించి నిర్మూలించడం, రసాయన మందులు ఎలా పిచికారీ చేయాలో ఆయన వివరించారు. గ్రామీణులకు సీజనల్ వ్యాధులు, పరిసరాల శుభ్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రైడే నిర్వహించాలన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ మాట్లాడారు. ప్రజా ఆరోగ్యం బాధ్యత క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లపై ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం ఆశావర్కర్లతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ బృహస్పతి, పూతలపట్టు ఎంపీడీఓ గౌరి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ పీర్ సాహెబ్, హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, సూపర్‌వైజర్ హరికృష్ణ, ల్యాబ్ టెక్నీషియన్లు శరత్, లలిత, బంగారుపాళెం, యాదమరి, తవణంపల్లె, పూతలపట్టు, ఐరాల మండలాల ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.